


ఆవిడ అనాకారి కాదుకాని బక్కచిక్కిన మనిషి; దవడలు బొత్తిగా అంటుకుపోయినై. కళ్లు విశాలమైనవైనా లోతుకుపోయినై. రొమ్ము ఎండిపోయింది. కాళ్లూచేతులూ ఊచలే. నడుముకూ పిరుదులకూ వ్యత్యాసం లేకుండా ఒకటో అంకెలాగా ఉండేది.

ఆవిడభర్త తన ఈడువాళ్లనీ, తన కంటె చిన్నవాళ్లనీ, తనకంటె చాలా పెద్దవాళ్లనీ అనేక మందిని చేరదీసేవాడు. నిత్యమూ వారింటికి వస్తూవున్న వారిలో అతను చాలా అందగాడు. కుర్రవాడు. పాతికేళ్ళు వెళ్ళినవో లేవో. అతని దర్శనం ఏ ఆడదానికన్నా ఆనందం ఇవ్వగలగవచ్చు. అతను తనకేసి నవ్వితే ఏ ఆడదీ మరివలే దనిపిస్తుంది.

అతనికి ఒకరిద్దరు ఆడవాళ్ళతో సంబంధం వున్నట్టు ఆమె విన్నది. అందుచేత అతను బొత్తిగా ప్రవరుడనుకోవలసిన అవసరం లేదు.

తన పరిశోధనకోసం ఆమె ఆ కుర్రవాణ్ణెన్నుకుంది.

ఆమె తనకేసి వింతగా చూడటం అతను త్వరలోనే గమనించాడు. అతనికి కొత్తలో అసహ్యం వేసింది. ఎండిపోయిన ఆవిడ రొమ్ములూ, నరాలు తేలిన

కొడవటిగంటి కుటుంబరావు



"నేను మీటింగులో మాట్లాడుతూంటే అంతా నోరు తెరుచుకుని వినేవారు."
"ఆవలిస్తూండేవారులాగుంది."

ఆవిడ పొడుగాటి మెడా స్మరించుకుని నవ్వుకున్నాడు.

నాలుగైదురోజులు గడిచిన తరవాత ఆకస్మాత్తుగా అతని హృదయంలో ఒక భావం మెరిసింది—ఆవిడ సన్నతనంలో ఎంత నాజూ కున్నది!

ఇటువంటి ఆలోచన కలిగినందు కతనికి ఆశ్చర్యం వేసింది. తను ఆ శవంలో ఏదో మంచి చూడగలగటం ఏమిటి? పుష్టి అయిన వక్షమూ, నిగనిగలాడే తొడలూ, నున్నటి కంఠమూ, పాలుగారే చెక్కిలూ ఎరిగిన తను—!

కాని ఆమె సన్నదనంలో ఏదో నాజూకు—సౌకుమార్యం—ఉన్నదనే ఆలోచన అతని తలలోనించి పోలేదు. పైగా మరింత దృఢం కాసాగింది.

ఒకనాడతను ఆమెకళ్ళకేసి చూశాడు. అతని కప్పటివరకూ ఆడవాళ్ళకళ్ళల్లో తేడాలు తెలీవు. ఈ కళ్లెంత అగాధంగా ఉన్నై! ఇతరుల కళ్ళల్లో ఏముంది? కనురెప్పలూ, కనుగుడ్డూ, నల్లగుడ్డూ, పాపం! ఈ కళ్ళల్లో బ్రహ్మాండం తాలూకు రహస్య మంతా వుంది!

ఆరోజల్లా అతని కా కళ్ళు జ్ఞాపకం వస్తూనేవున్నై.

మరోరోజు ఆమె, ఆవిడ భర్తా, అతనూ మాత్రమే వున్నప్పుడు ఒకమాట అన్నది.

"ప్రేమలూ, గీమలూ చెప్పకండి. ఒకటే ప్రేమ వుంది ప్రపంచంలో—పరమ కురూపికి నవమన్మధుడిమీదా, నవమన్మధుడికి కురూపిమీదా కలిగే ప్రేమ! అది అంటుకుంటే చల్లారదు; ప్రపంచాన్ని భస్మం చేస్తుంది. మిగిలిన ప్రేమ లన్నీ

ఇస్తివాయినం, పుచ్చుకుంటి వాయినం!"

అతను దద్దరిల్లిపోయినాడు. నాలుక పొడారింది. ఆమె భర్త కేసి చూశాడు.

ఆమెభర్తకూడా విస్మయపడ్డవాడల్లె మిగిలిన ఇద్దరికేసి రెండుసార్లు చూసి పెద్దపెట్టున నవ్వాడు.

ఆపిడ తన చేతి వేళ్ళ కేసి చూసు కుంటూ నిశ్చలంగా కూచుంది.

అతని కారోజల్లా ఇంకో ఆలోచనే లేదు. ఆమెను ఒక్కక్షణంకూడా మరవ లేన టయింది. ఆమె చెప్పింది నిజం. ప్రేమతో పోలిస్తే కామం ఏపాటిది? ఎంత గోదుపెచ్చనిది! ఆమె తనను ప్రేమిస్తున్నది. తను ఆమెను ప్రేమించ కుండా ఉండటం అసంభవం! గోగు పుడకలాంటి ఆమె శరీరంలో రక్తం కాదు, అగ్ని ప్రవహిస్తున్నది. తను అదివరకెరిగిన ఆడవాళ్ళు సీళ్ళకుండలు! అరటిబోదెలు! ఆవిడ హాలాహలం! అదే కావాలి తనకు.

ఆ రాత్రి అతనికి ఆలస్యంగా నిద్ర పట్టింది. కల వచ్చింది. ఆమె వచ్చి తన సరసనే పడుకుంది. ఆమె చేతులు తన చుట్టూ వెయ్యగానే తన శరీరంలో విద్యుత్తు ప్రవహించింది. ఆమె మొహాని కేసి తన మొహం అనుముకుంటే గుచ్చు కున్నది. ఆమె కళ్ళల్లోకి చూస్తే గాడాంధ కారం. ఆ గుడ్లల్లో ఏమీ లేదు. మొహం వెనక్కులాగి చూచునుగదా తన పక్కన పడుకుని తన చుట్టూ చేతులు వేసినది మనిషికాదు—అస్థిపంజరం...

మర్నాడు అతను నూరు డిగ్రీల జ్వరంతో ఆమెను చూడబోయినాడు. "నిన్ను విడిచి బతకలేను. నన్ను చంపకు; నువు నాదానివైతే నేను మరుక్షణం చావ టానికైనా లెక్కచెయ్యను," అని మన స్సులో ఆవిడతో అంటూ ఇంటో ప్రవే శించాడు.

ఆమె ఒంటరిగా వుంది. అతని జ్వరం మరో రెండు డిగ్రీలు పెరిగింది. అతని నోరు స్వాధీనం తప్పింది. మహత్తర మైన శక్తి ఏదో తనని ప్రేరేపిస్తున్న ట్టుగా అతను ఆమె పక్కనే కూర్చుని బెండువంటి ఆమె శరీరాన్ని దగ్గిరికి తీసుకుని కండలేని ఆమె మూతి ముద్దు పెట్టుకున్నాడు. అతని మొహాన చెమట కాలవలు కదుతున్నది.

ఆమె ఈ ప్రణయ ప్రదర్శనానికి కంగారుపడలేదు. చిరునవ్వు నవ్వి, "చాలు, చాలు! నా అభిప్రాయం ఇది కాదు, మావారికి నన్ను చూస్తే ఒక దురభిప్రాయం! నే నెవ్వరికీ అక్కర్లేదని! నన్ను వీధిలో పారేస్తే నల్లకుక్కయినా ముట్టదని! ఈయన పొరపాటుపడ్డట్టు కనిపిస్తుంది! ఆ విషయం నిన్నడిగి అనుమానం రహితం చేసుకుందా మను కుంటుండగా, దేవుడల్లె వచ్చి నువ్వే నా అనుమానం తీర్చావు. నన్ను బాధించకు. నాకు మావారిమీదతప్ప మరెవ్వరిమీదా భ్రమలేదు!" అన్నది.